# మడతపంక్తి

అప్పుడప్పుడు ప్రసన్న ఇంటికి చేరుకునేసరికి రాత్రి పదకొండు అవుతుంటుంది. కొన్నిసార్లు పన్నెండు దాటుతుంది. వీధి తలుపు దగ్గరగా వేసి ఉంటుంది. గడివేయరు. తలుపు తట్టో, కాలింగ్‌బెల్ నొక్కో అతను ఎవరినీ ఇబ్బంది పెట్టనవసరం లేదు. అతని గదిలోని బల్లమీద హాట్‌పేక్‌లో భోజనం పెట్టి ఉంటుంది. చిన్నశబ్దమయిందంటే అతని తల్లి నిద్ర లేచి ఇంటికి ఆలస్యంగా చేరుకున్నందుకు పాఠం తీసుకుంటుంది. తల్లితో మాటలు పడటం అతనికి ఇష్టంగా ఉండదు. వీలయినంతవరకు ఏ శబ్దం చేయకుండా భోజనం చేసి, మంచినీళ్ల కోసం వంట గదిలోకి వస్తాడు. వంటగదిలో గోడవారగా ఉన్న భోజనాల బల్ల మీద మోచేతులు పెట్టి భూషణం కుర్చీలో కూర్చుని ఉంటాడు. అతని చేతివేళ్ల మధ్య సిగరెట్ వెలుగుతూ ఉంటుంది. భూషణం ప్రసన్న తండ్రి. అప్పటి వరకు ఏదో ఆలోచిస్తున్న భూషణం వంటగదిలోని దీపం వెలగగానే ఈ లోకంలోకి వచ్చినట్టు కనబడతాడు. బల్లమీద రెండు సిగరెట్ పెట్టెలు, అగ్గిపెట్టె, యాష్‌ట్రేలు ఉంటాయి. అతను ఉదయం నుండి సాయంత్రం వరకు రెండుమూడు సిగరెట్లు కన్నా ఎక్కువ తాగడు. రాత్రి భోజనం చేసి, ఇంట్లో వాళ్లందరూ నిద్రపోయాక అక్కడే కూర్చుని, చీకట్లో రెండు పెట్టెల సిగరెట్లు తాగుతాడు.

❁ ❁ ❁

భూషణానికి యాభయి ఎనిమిది సంవత్సరాలుంటాయి. పెద్దమ్మాయిని బాగా చదివించి మంచి సంబంధం చూసి పెళ్లి చేశాడు. రెండోవాడు ప్రసన్న. పి.జి. చేసి బేంకులో ఉద్యోగం చేస్తున్నాడు. మూడోవాడు మెడిసిన్ రెండో సంవత్సరంలో ఉన్నాడు. భూషణం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలో పనిచేస్తున్నాడు. కంపెనీ వాళ్లు తక్కువ ఖరీదుకు స్థలమిస్తే మంచి ఇల్లే కట్టుకున్నాడు. ఏ ఒడిదుడుకులు లేకుండా జీవితాన్ని

సజావుగా నెట్టుకొస్తున్నాడు. ఎలక్ట్రికల్ మెయిన్‌టెన్స్ విభాగంలో అతనికి మంచి పేరుంది. నమ్మకస్తుడు. ఏ విషయంలోనూ జోక్యం కలిగించుకోడు.

లోగడ తండ్రిని అంత పరిశీలనగా గమనించని ప్రసన్న ఒక రాత్రి మంచినీళ్ళు తాగడానికి వంట గదిలోకి వచ్చి, "నిద్ర పోలేదేం నాన్నా?" అడిగాడు.

"నిద్రపోతాను" అన్నాడు భూషణం.

ప్రసన్న ఇంటికి ఎంత ఆలస్యంగా వచ్చినా ఎందుకు ఆలస్యమయిందని భూషణం ఎప్పుడూ అడగలేదు. ప్రసన్న సివిల్స్‌కు తయారవుతున్న సంగతి అతనికి తెలుసు.

మంచినీళ్లు తాగి ప్రసన్న గది బయటకు వెళ్లిపోతోంటే, "బాబ్జీ, లయిటార్పేయరా" అన్నాడు భూషణం. అతనికి దీపం ఉండడం ఇష్టంలేదు. ప్రసన్న దీపం ఆర్పేసి తన గదిలోకి వెళ్లిపోయాడు.

ఇంకో రోజు పన్నెండు దాటిన తర్వాత ప్రసన్న వంటగదిలోకి వచ్చి చూసినప్పుడు తండ్రి అక్కడే కూర్చుని సిగరెట్ తాగుతూ కనిపించాడు.

"నాన్నా".

"చెప్పు బాబ్జీ."

"పన్నెండు దాటింది."

"అవును. రోజూ ఇంతసేపు మెలకువగా ఉంటే ఆరోగ్యం పాడవుతుంది."

"నిద్రపోతాను."

"గంటల తరబడి ఒక్కడివే ఇలా ఎందుకు కూర్చుంటావు?"

"..........."

"జరగకూడనిదేమయినా జరిగిందా?"

"ఏం జరగలేదు."

"దేని గురించయినా ఆలోచిస్తూ ఉంటావా?"

"లేదు బాబ్జీ. ఇలా కూర్చుంటే విశ్రాంతి తీసుకుంటున్నట్టుగా ఉంటుంది."

భూషణం ఎవరితోనూ కోపంగా మాట్లాడడు. పిల్లల మీద అరవడు. ప్రసన్నకు అర్థం కాని విషయం ఒక్కటే. తండ్రి కూర్చుంటోంది పడకకుర్చీలో కాదు. మడత కుర్చీలో కాదు. చెక్కకుర్చీలో కూర్చుంటున్నాడు. గంటల తరబడి ఆ కుర్చీలో కూర్చుని

విశ్రాంతి తీసుకోడానికి అనువుగా ఉండదు. అంతసేపు కూర్చుని ఏమి ఆలోచిస్తుంటాడో తెలియదు. తనకు తెలిసి తండ్రికి ఆర్థిక ఇబ్బందులు లేవు. డబ్బు ఎంతో ఎక్కువ లేకపోయినా తడుముకోవలసినంత బాధ ఏమాత్రం లేదు. ఎవరి నుండి ఏది తీసుకోడు. ఎవరికీ బాకీ లేదు. ఆరోగ్యానికేం లోపం లేదు. ఇంట్లో అందరూ ఆరోగ్యంగానే ఉన్నారు. ఎవరికీ ఎటువంటి సమస్యలు లేవు.

ఇంకేం అయి ఉంటుంది? తన తల్లిదండ్రుల గురించి తండ్రి ఆలోచిస్తున్నాడా? తన తండ్రి చిన్నప్పుడే వాళ్లు చనిపోయారు. తోబుట్టువులు ఎవరూ లేరు. తండ్రిని దగ్గరకు తీసి, పెంచి, చదివించి, పెద్దచేసిన చిన్నాన్న చనిపోయి అయిదేళ్లు అయింది. ఆయన పిల్లలు బాగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడిపోయారు. వాళ్ల గురించి ఆలోచిస్తూ ఉంటాడని తను అనుకోవడం లేదు. తండ్రికి ఏ చింతా ఉన్నట్టు అనిపించదు. ఏదో పోగొట్టుకున్నట్టూ, దేనికోసమో ఆరాటపడుతున్నట్టు కూడా అవుపించదు. ఉదయం నుండి రాత్రి భోజనాలు ముగించేవరకు అందరితోనూ బాగానే మెలుగుతాడు. నవ్వుతూ గడిపేస్తుంటాడు. భోజనాలయ్యాక ఆ కుర్చీలో కూర్చుంటాడు. విశ్రాంతి తీసుకుందుకు కూర్చున్నట్టుగా అనిపించదు. మానసికంగా నలుగుతున్నట్టుగా కూడా ఉండదు. కంపెనీలో ఎలక్ట్రీషియన్ అప్రంటిస్ అయి రోజువారీ కూలీగా చేరి అసిస్టెంటు ఫోర్‌మేన్‌గా ఎదిగాడు. జీవితంలో చాలా కష్టపడ్డాడు. అంతమాత్రంగా పయికి రాగలనని అనుకుని ఉండదు. పదవీ విరమణ చేసే లోపల మరో ప్రమోషన్ రావొచ్చు. అయిదేళ్ళ కింద ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలానే ఉన్నాడు. ఆమాటకొస్తే మునుపటి కన్నా బావున్నాడు. ఒకే ఒక్క విశేషం. విశేషం కూడా కాదు. చీకట్లో కూర్చుని సిగరెట్లు తాగుతూ ఎదురుగా ఉన్న కిటికీలోంచి చీకట్లోకి చూస్తూ ఉండిపోతాడు. నాలుగయిదు గంటల్లో తెలవారుతుందనగా మంచం మీదకు చేరుకుని నిద్రకు ఉపక్రమిస్తాడు. మళ్ళీ ఉదయాన్నే అందరికంటే ముందే నిద్రలేస్తాడు.

తండ్రి కుర్చీలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నాడంటే ప్రసన్నకు అలా అనిఫించడం లేదు. ఆయన కేదయినా సహాయం చేయాలి. తనకు సహాయం కావాలని తండ్రి ఎందుకు కోరుకోవడం లేదు? తనకు ఏం కావాలో ఎందుకు చెప్పడం లేదు? చిన్నగా చెప్పొచ్చు. రహస్యం చెప్పినట్లు చెప్పొచ్చు. పెద్దగా అరిచి చెప్పొచ్చు. ఏదో

ఒకటి చేస్తే బావుంటుంది. కొన్ని విషయాలు చెప్పినప్పుడు భారం తగ్గి హృదయం తేలిక అవుతుంది కదా!

అడగకూడదనుకుంటూనే తండ్రి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఒకరోజు ప్రసన్న అడిగాడు, "నీకేమయినా సమస్యలున్నాయా నాన్నా?"

"సమస్య లేమీ లేవు" అన్నాడు భూషణం.

"ఏ సమస్యా లేకపోతే గంటల తరబడి ఈ కుర్చీలో కూర్చుని ఏమి ఆలోచిస్తూ ఉంటావు?"

"ఏం లేదు."

"మాకు తెలియకుండా మేమేయినా పొరపాట్లు చేస్తున్నామా?"

"లేదు. చేయడం లేదు. ఈ కుర్చీలో కూర్చుంటే విశ్రాంతి తీసుకున్నట్టుగా ఉంటుంది.

"అలా కూర్చున్నప్పుడు ఎటువంటి ఆలోచనలు రావా?"

"సమస్యలేమయినా ఉంటే ఏవేవో ఆలోచనలు వస్తుంటాయి. అంతకు తప్ప ఏం ఉండవు."

ప్రసన్న దీర్ఘంగా నిట్టూర్చాడు. తండ్రి దగ్గర నుండి జవాబు రాబట్టడం అంత తేలికయిన విషయంలా అతనికి అనిపించలేదు. అక్కడినుంచి కదిలి తన గదిలో కూర్చున్నాడు. ఆ వీధిలో తమదే చివరి ఇల్లు. ప్రహరీ గోడకు అవతల ఖాళీ ప్రదేశం. అక్కడెక్కడో దట్టంగా చెట్లు. చెట్ల మించి విసిరే గాలి ఆ ప్రాంతమంతా చిక్కగా తిరుగుతుంటోంది. నిశ్శబ్దంగా ఉండే చీకట్లో తండ్రి ఏం చూస్తుంటాడు?

కుర్చీలోంచి లేచి శబ్దం చేయకుండా వంటగదిలోకి నడిచాడు ప్రసన్న. భూషణం ఇంకా అక్కడే కూర్చుని చీకట్లోకి చూస్తున్నాడు. తలుపుకు ఆనుకుని, చీకటికి అలవాటు పడ్డాక తండ్రి చూస్తున్న దిక్కు వయిపు దృష్టి సారించాడు. గోడగడియారం కదిలే చప్పుడు స్పష్టంగా వినిపిస్తోంది. చిక్కటి చీకటి తప్ప ఏమీ కనిపించడం లేదు. గాలి విసిరేసినట్లు నక్షత్రాలు దూరదూరంగా వెళ్ళిపోయాయి. వీధి దీపపు వెలుతురు ఇంటికి అవతల గాలికి వణుకుతోంది. ఇంటివరకు రావడం లేదు ప్రసన్న దీపం వెలిగించాడు.

హఠాత్తుగా దీపం వెలిగేసరికి భూషణం ఉలిక్కిపడ్డాడు.

"నాన్నా, ఇంకా నిద్రపోలేదా?" అడిగాడు ప్రసన్న.

"నిద్రపోదామనుకుంటున్నాను."

"ఒంటిగంట కావస్తోంది."

"అబ్బో. చాలా అయింది."

"రేపు కంపెనీకి వెళ్ళడం లేదా?"

"వెళ్ళాలి. దీపం ఆర్పేయకూడదూ?"

"మంచినీళ్ళు తాగుదామని వచ్చాను."

"వెళ్ళిపోయేటప్పుడు ఆర్పేసేయి. దీపం ఉంటే నాకు ఇష్టం అనిపించదు".

ప్రసన్న దీపం ఆర్పేశాడు. నీళ్ళు తాగి, "ఇంతరాత్రి వరకు ఎందుకు మెలకువగా ఉంటారు?"అడిగాడు.

"నిద్రవస్తోంది. వెళ్ళి పడుకుంటాను. నా చిన్నతనంలో నేను విద్యుత్‌దీపాల మధ్య పెరగలేదు. ఊరంతా ఉండేది. మాకు వచ్చేదికాదు. కిరసనాయిలు దీపపు వెలుగులో చదువుకున్నాం. కొన్నిసార్లు కిరసనాయిలు కూడా దొరికేది కాదు. చాలా ఇబ్బందిగా ఉండేది. రాత్రిళ్ళు ఇంట్లో దీపం లేకుండా గడిపిన రోజులు చాలా ఉన్నాయి. రేషన్ షాపులకు కిరసనాయిలు, మిగతా సరుకులు రావని కాదు. మా వరకు వచ్చేవి కావు, అదంతే" అన్నాడు. భూషణం మాటల్లో బాధ ధ్వనించలేదు. సామాన్యమయిన విషయం చెప్పినట్టుగా ఉంది. కొద్దిసేపు ఆగి, "అన్నీ అందరికీ అందనివ్వరు. ఇప్పటికీ అంతే" అన్నాడు.

"చీకట్లో కూర్చుని ఈ విషయం గురించే ఆలోచిస్తుంటావా?"

"కాదు, అదేం కాదు" అంటున్నప్పుడు భూషణం స్వరం ఎక్కడినుండో, ఎన్నేళ్ళో వెనక్కి వెళ్ళినట్లుగా అనిపించింది. తన మీద తను జాలిపడడం మానేసి చాలా సంవత్సరాలు గడిచాయి.

సహాయం చేస్తానని నమ్మి బలికించిన సబ్ ఇన్‌స్పెక్టరు ఎదిగి డి.ఎస్.పి. అయ్యాడు. రెండు మూడేళ్ళలో పదవీ విరమణ చేస్తాడనగా కూంబింగ్‌లో చనిపోయాడు. వాటాల దగ్గర తేడాలు వచ్చి అన్నలే లేపేశారో, పోలీసులే చంపేశారో తెలియదు. అవతలి వయిపు నుండి డబ్బులు తీసుకుని కేసును ముంచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటరు ఒకే ఒక్కసారి శాసనసభకు ఎన్నిక అయ్యాడు. ఆ తర్వాత ఎదురు

డబ్బులు ఇచ్చి పార్టీలు మారాడు. ఉన్నదంతా ఊడ్చుకుపోయింది. ముష్టి ఎత్తుకుని బతుకుతున్నాడని ఎవరో అన్నారు. నిజమే అయి ఉంటుంది. కేసు తొక్కిపట్టిన జడ్జి జిల్లా స్థాయి నుండి హైకోర్టుకు ఎదిగి అటునుండటు సుప్రీంకోర్టుకు ఎగబాకి ఫండ్స్ కేసులో ఇరుక్కుని పదవీ విరమణ చేయించబడ్డాడు. చాలా కేసులు ఉన్నాయి. తవ్వితే చాలా బయట పడతాయి. ఈ మధ్యే ఆస్తులు వెల్లడించుకుంటున్నారు.

ప్రసన్న వెళ్ళిపోయాక పెట్టెలోంచి సిగరెట్ తీసి వెలిగించాడు. కాలుతున్న అగ్గిపుల్లను సిగరెట్ పొగతో ఆర్పాడు. ఆరిపోయిన అగ్గిపుల్లను వేళ్ళతో పట్టుకున్నాడు. యాష్ట్రే నిండిపోయి ఉంది. అగ్గిపుల్లకు కూడా చోటు లేదు. రెండు టిన్నుల కిరసనాయిలు. ఒక్క అగ్గిపుల్ల. అమ్మ ఆర్తనాదం తనకింకా వినిపిస్తోంది. చీకట్లోకి చూసినప్పుడల్లా అమ్మ కాలిపోతున్న దృశ్యం కనిపిస్తూ ఉంటుంది. అంతే అంతకన్నా ప్రత్యేకంగా ఏమీ లేదు. ఎలా మర్చిపోవడం?

❖ ఆదివారం వార్త, 13 సెప్టెంబరు 2009